క్లుప్తంగా

విద్యార్థి దశలోనే భక్తిభావం



నర్సంపేట : విద్యార్థి దశలోనే చదువుతోపాటు ఆధ్యాత్మికత, భక్తిభావం పెంపొందించేలా 6, 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి ప్రజ్ఞ, సంస్కార్ విభాగ్ బాధ్యులు మెరుగుజు రేణుక, త్రివేణి తెలిపారు. పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హైస్కూల్ విద్యార్థులకు వికాస తరంగిని స్థానిక శాఖ, ప్రజ్ఞ, సంస్కార విభాగం ఆధ్వర్యంలో గురువారం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరూ ఉన్నతులుగా ఎదిగే దిశగా వికాస తరంగిని ఆధ్వర్యంలో కార్యక్రమంలో వికాస తరంగిని ప్రజ్ఞ, సంస్కార విభాగ్ బాధ్యులు గొట్టెపర్తి త్రివేణి, ఎర్రబోయిన రాజశేఖర్, అధ్యక్షులు కృష్ణారావు, రంగనాథ్, కరస్పాండెంట్ పాశికంటి రమేశ్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్)లో డాక్టర్ వి.మధుకుమార్, కార్తీక్‌కుమార్, ప్రసాద్, బాలకృష్ణ రచించిన వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ పుస్తకాన్ని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ రంగంలో సదరు పుస్తకం మైలురాయిగా నిలువనుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, ఏసీ నారాయణ, ఏఓ సురేశ్, ఈసీఈ హెచ్‌ఓడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్




దుగ్గొండి : మండలంలోని పీజీతండాలో గురువారం సాయంత్రం తీజ్ పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు మంచెపై ఉంచిన గోధుమ బుట్టలను పూజించారు. అనంతరం ఏపుగా పెరిగిన గోధుమ బుట్టలను ప్రత్యేకంగా అలంకరించి డప్పుచప్పుళ్లు, నృత్యాలతో ర్యాలీగా ఊరి చివర ఉన్న చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. అనంతరం సీత్లా భవాని మాతకు గొర్రెలు, మేకలను బలి ఇచ్చారు.

సన్మానం



వర్ధన్నపేట : స్థానిక పశు వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా విధులు నిర్వహించిన డాక్టర్ యాకూబ్‌రెడ్డి బదిలీ కాగా ఆయన్ను వైద్యులు, సిబ్బంది గురువారం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సాహిత్య కుమార్, సిబ్బంది వీరన్న, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓకు..



నల్లబెల్లి : మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రవిని దళిత సంఘాల నాయకులు గురువారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడారు. కార్యక్రమంలో దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి సాంబయ్య, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) నాయకుడి మృతి

గీసుకొండ : మండలంలోని గీసుకొండకు చెందిన ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి కందికొండ కుమారస్వామి (55) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. వరంగల్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్లిన సమయంలో అక్కడే గుండెపోటుకు గురై కుప్పకూలాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

రేపు కౌన్సిలింగ్

నర్సంపేట : నర్సంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో సీఈటీ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం రేపు (శనివారం) మడికొండలోని బాలుర (వర్ధన్నపేట) కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కోసం మడికొండలోని కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

కోతుల బెడద.. పారిశుద్ధ్య సమస్య

- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో ప్రజలు తెలిపిన ప్రధాన సమస్యలు
- డ్రెయినేజీల్లో మురుగు, దోమలు, వీధి కుక్కలతో ఇబ్బందులు
- వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ ఇ జోనాకు సమస్యలు వివరించిన ప్రజలు



వర్ధన్నపేట: కోతుల స్వైర విహారం.. పేరుకుపోయిన పారిశుద్ధ్యం.. దోమలు, కుక్కల బెడద.. ఇవి వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో జనాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. గురువారం సాక్షి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఇ జోనాతో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. కాగా, పలు సమస్యలపై వెంటనే స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులు, సిబ్బందితో మాట్లాడి పరిష్కారం దిశగా ఆదేశాలు, సూచనలు చేశారు. పలు వార్డుల్లో వెంటనే పనులు సైతం చేపట్టడం గమనార్హం.

ప్రశ్న: పట్టణంలోని 3వ వార్డు వరంగల్– ఖమ్మం ప్రధాన రహదారిపై వివేకానంద విగ్రహం వద్ద నుంచి స్మశాన వాటిక వరకు ఉన్న వీధి దీపాల్లో కొన్ని వెలగడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– యాకయ్య, ఆకుల మనోజ్‌కుమార్ 3వ వార్డు

కమిషనర్: వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం. సాయంత్రం(గురువారం) లోగా సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: మా వీధిలోని బోరు బావి పని చేయడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డ్రెయినేజీలతో ఇబ్బంది ఉంది.. రోడ్ల వెంట చెట్లు తొలగించండి.

–బొంత కాంతం, 7వ వార్డు

కమిషనర్: పట్టణంలోని 91 బోరు బావులను మరమ్మతులు చేయించాం. ఎక్కడా మరమ్మతులు లేవు, ఆ బోరు బావిలో నీరు లేని కారణంగా బోరునుంచి నీరు రావడం లేదు. రోడ్లవెంట పిచ్చి చెట్లను తొలగిస్తున్నాం. డ్రెయినేజీలను రెండు రోజుల్లో శుభ్రం చేస్తారు.

ప్రశ్న: కోతులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డ్రెయినేజీ వెంట పిచ్చి చెట్లు పెరిగాయి. డ్రెయినేజీల్లో చెత్త పేరుకు పోయింది.

–పెద్దూరి సత్యం, 3వ వార్డు

కమిషనర్: కోతుల బెడదను తీర్చడానికి ప్రత్యేక కార్యచరణ కోసం కృషి చేస్తాం. డ్రెయినేజీల్లో నిలిచిన మురుగును, పిచ్చి చెట్లను త్వరలో తొలగిస్తాం



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ ఇ జోనా

ప్రశ్న: రామలీలా మైదానం వద్దనున్న బోరు బావికి విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–ఆకుల మనోజ్, 8వ వార్డు

కమిషనర్: రామలీలా మైదానంలోని బోరు బావి వద్ద 120 మీటర్ల విద్యుత్ తీగ అపహరణకు గురైతే మళ్లీ బిగించాం. అయినా బోరు నడవకుంటే పరిశీలించి పునరుద్ధరిస్తాం

ప్రశ్న: యాదవకాలనీలోని రాజబోయిన గట్టయ్య ఇంటి వీధి బురదమయంగా మారింది. మొరం పోసి చదును చేయించాలి

–జక్కుల సాయిలు, 9వ వార్డు

కమిషనర్: యాదవకాలనీలో బురదమయంగా మారిన రోడ్డుపై త్వరలో మొరం పోసి చదును చేయిస్తాం.

ప్రశ్న: ఊరకాల్వలో ప్లాస్టిక్ సీసాలు, చెత్తా చెదారంతో దుర్వాసన, ఈగలు, దోమలతో జ్వరాలు వస్తున్నాయి.

–బాల్య రమేష్, 3 వార్డు

కమిషనర్: రెండు రోజుల్లో చెత్తను తొలగించడంతో పాటు, బ్లీచింగ్, ఫాగింగ్ చేయించి సమస్యను పరిష్కరిస్తాం

ప్రశ్న: మటన్ షాపుల్లోంచి కుక్కలు వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్లపై పడేస్తున్నాయి. దుర్వాసన వస్తుంది. కుక్కల బెడద ఉంది.

–శోభన్‌బాబు, 3వ వార్డు

కమిషనర్: రోడ్లపై మటన్ వ్యర్థాలు పడకుండా వెంటనే చర్యలు చేపడతాం. కుక్కలు, కోతుల బెడదను తీర్చడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: పాత తక్షశిల కళాశాల భవనం వెంట ఉన్న కాల్వ చెత్తా చెదారంతో నిండిపోయింది. గతంలో ఇది పంట కాల్వ పైన, చివర ఇళ్ల వారు కాల్వను పూడ్చడంతో ఇబ్బందులు ఉన్నాయి. ఈ కాల్వను పూర్తిగా పూడ్చి వేయాలి.

–దోపతి రమేష్, 9వ వార్డు

కమిషనర్: పంట కాల్వ అవసరం లేకుంటే వెంటనే పూడ్చిస్తాం. అవసరమైతే పంట కాల్వలోని చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తాం. వెంటనే చర్యలు చేపడతాం.

ప్రశ్న: మా వీధిలో ఏర్పాటు చేసిన బోరుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటికి ఇబ్బంది ఏర్పడుతోంది. నల్లా నీటిలో తోక పురుగులు వస్తున్నాయి.

–కొండేటి రాజు, 10వ వార్డు

కమిషనర్: కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు బోరు బావులకు విద్యుత్ మీటర్లకు డబ్బులు చెల్లించాం. వెంటనే సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. నల్లా నీటిలో పురుగులు వస్తున్న విషయంపై వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: శివాలయం వీధిలోని డ్రెయినేజీని చివరి వరకు పునరుద్ధరించాలి. డ్రెయినేజీలోని మురుగు, చెత్తను తీసి కుప్పలు వేసి వాటిని తరలించడం లేదు.

–దోపతి అశోక్‌కుమార్, 11వ వార్డు

కమిషనర్: డ్రెయినేజీని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైతే పొడిగిస్తాం. మురుగు కుప్పలను వెంటనే తొలగించేందుకు సిబ్బందిని ఆదేశిస్తాం.

ప్రశ్న: మా ఇంటి ఎదుట పాత ఇంట్లోంచి పాములు వస్తున్నాయి. చెత్తా చెదారం తొలగించాలి. సీసీ రోడ్లపై పెంట కుప్పలు పోస్తున్నారు. చర్యలు తీసుకోవాలి.

–ఎర్రగొల్ల జగన్, 9వ వార్డు

కమిషనర్: వెంటనే సిబ్బందిని పంపిస్తాం. పాత ఇళ్లు, కూలి పోయిన ఇళ్ల వద్ద చెత్తా చెదారం పోయకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్లపై పెంట కుప్పలు పోయకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

వెంటనే స్పందించిన అధికారులు

ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు, సిబ్బంది వెంటనే చర్యలను చేపట్టారు. మూడవ డివిజన్‌లో కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ పనులు వెంటనే సానిటరీ ఇన్‌స్పెక్టర్ అయిలయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. 3వ వార్డులో మటన్ షాపుల వద్ద నుండి వ్యర్థాలు కుక్కలు రోడ్లపై వేస్తున్న అంశంపై ఫిర్యాదురాగా.. షాపు యజమానులకు నోటీసులు జారీ చేసి, చెత్త తరలింపునకు సహకరించాలని కోరారు.



మటన్ షాపు యజమానులకు నోటీసులను అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పడి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు జరిగాయని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. తండాలు, గ్రామ పంచాయతీల్లో గతంలో రోడ్లు వేయలేదంటూ రాష్ట్ర మంత్రి సీతక్క అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గానికి విడుదల చేసిన వందల కోట్ల రూపాయల నిధులు మూలుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు, తండాల్లో రోడ్ల పనులను నిలిపి వేసిందని ఆరోపించారు. కొన్ని రోడ్లు కంకరపోసి ఉన్నాయని, మరో కొన్ని పనులకు టెండర్లు, అగ్రిమెంట్ దశలో ఉన్నాయని, మరికొన్ని టెండర్లు పిలవాల్సిన పరిస్థితిలో ఉన్నాయని వివరించారు. 2023–24 బడ్జెట్‌లో సీఎం దగ్గర ఉండే ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మొదలైన పనులు, విడుదలైన నిధులపై జరుగుతున్న పనులపై రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా స్థాయిలో మంత్రి సీతక్క, నర్సంపేట స్థాయిలో ఎమ్మెల్యే మాధవరెడ్డి సమీక్షించలేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్లు, పురోగతిలో ఉన్న పనులను సమీక్షించి త్వరగా పూర్తి చేసే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వం మొదలు పెట్టిన పనులను త్వరగా చేపట్టాలని కోరారు.

ఏజెన్సీలో రెడ్ అలెర్ట్

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీలో రెడ్ అలెర్ట్ పరిస్థితులు నెలకొన్నాయి. ఈనెల 28 నుంచి 3గస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని కోరుతూ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ బుధవారం రాత్రి పత్రిక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నర్సంపేట, ములుగు జిల్లాల సరిహద్దులో పోలీసులు రెడ్ అలెర్ట్ ప్రకటించి కూంబింగ్ చేస్తున్న క్రమంలో గుండాల అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగి ఒక మావోయిస్టు మృతి చెందినట్లు తెలుస్తోంది. మావోయిస్టు పత్రిక ప్రకటన విడుదలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అటు పోలీసులు, అటు మావోలు ఏజెన్సీలో సంచరిస్తుండడంతో జిల్లా సరిహద్దు ప్రాంతంలో అలజడి నెలకొంది. నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి, ఖానా పురం, పాకాల అటవీ ప్రాంతాలు, ములుగు జిల్లాలోని కొత్తగూడ, గుండాల ప్రాంతాలకు సరిహద్దు అటవీ ప్రాంతంగా ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతం నక్సలైట్లకు అనువుగా ఉండడంతో ఎన్‌కౌంటర్లు జరిగిన పరిస్థితులు ఉన్నాయి. చాలా కాలం తర్వాత మావోయిస్టు నేత జగన్ పత్రిక ప్రకటన విడుదల చేయడం, మరుసటి రోజే ఎన్‌కౌంటర్ జరిగినట్లు ప్రచారం కావడంతో ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనని భయాందోళనలు నెలకొన్నాయి.

ఏజెన్సీలో పట్టు కోసం ప్రయత్నాలు..?

నర్సంపేట అటవీ ప్రాంతం ఇతర జిల్లాలకు విస్తరించి ఉండడంతో ఈ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారోత్సవాల పేరిట సంచరిస్తున్న మావోయిస్టులు కంటపడడంతోనే ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి యాక్షన్ ప్లాన్ అమలుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం'

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధికార ప్రతినిధి గుంటి వీరప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు లేదన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసి రవాణా, రెవెన్యూ, విద్య, వైద్యం, తదితర వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉండగా మొండిచేయి చూపిందన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్, వరంగల్‌లో వినామాశ్రయ నిర్మాణం, తదితరాలను విస్మరించిందని వాపోయారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు సాధించేలా రాజకీయాలకతీతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో రహస్య ఒప్పందం కుదుర్చుకుని బీజేపీ ఎంపీల గెలుపునకు కారణమైందని ఆరోపించారు. గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ సమస్యలు పరిష్కరిస్తాం



రుణమాఫీ అమలును పరిశీలిస్తున్న ఏడీఏ హైదర్

గీసుకొండ : రైతులు రుణమాఫీ సమస్యలను ఏఓలు, ఏఈఓల దృష్టికి తీసుకొస్తే జిల్లా అధికారుల సహకారంతో పరిష్కరిస్తామని డీఏఓ కార్యాలయ ఏడీఏ గౌస్ హైదర్ తెలిపారు. మండలంలో రుణమాఫీ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. రుణమాఫీ కాలేదంటూ వచ్చిన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ హామీ మేరకు రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ అవుతోందని చెప్పారు. లిస్టులో పేరు లేని అర్హులు ఏఓను, ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. యూనియన్ బ్యాంకులో రుణమాఫీ విషయమై మేనేజర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ హరిప్రసాద్‌బాబు, ఏఈఓలు కావ్య, ఆబిద్ హుస్సేన్, రజని, విజయ్, అఖిల, యూబీఐ మేనేజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రజని



చెన్నారావుపేట : స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌గా రెవెన్యూ కార్యాలయంలో రజని గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ వరంగల్ సివిల్ సప్లయ్ విభాగానికి డీటీగా బదిలీపై వెళ్లారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నల్లబెల్లి : మండలంలోని రేలకుంటలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించి సుమారు 100 లీటర్ల బెల్లం పానకం, 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ప్రశాంత్ బాబు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది రేలకుంటలోని స్థావరాలపై దాడి చేసి హలావత్ సమ్మయ్య, హలావత్ వనజ ఇళ్లలో గుడుంబా, బెల్లం పాకాన్ని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. సమ్మయ్య, వనజలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ వేణు, హోంగార్డు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేవలం ఆంధ్రప్రదేశ్‌కు వర్తింపజేసి తెలంగాణకు అన్యాయం చేశారని తెలిపారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్సై ప్రశాంత్ బాబు చేరుకుని నాయకులతో చర్చించి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, ఉపాధ్యక్షుడు పెంతల కొమురారెడ్డి, నాయకులు మాలోత్ చరణ్‌సింగ్, మామిండ్ల కొమురెల్లి, జెట్టి రామ్మూర్తి, ఇంద్రారెడ్డి, బత్తిని మల్లయ్య, పురుషోత్తం సురేశ్, ఏడాకుల సంపత్‌రెడ్డి, కొండి అశోక్, భావ్‌సింగ్, బత్తిని మహేశ్, సుమన్, భైరి వెంకట్, జంగిలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో వ్యాధుల నుంచి రక్షణ



చెన్నారావుపేట : పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



వర్ధన్నపేట : మందులు ఇస్తున్న సిబ్బంది

చెన్నారావుపేట : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పీహెచ్‌సీ వైద్యురాలు సరోజ తెలిపారు. మండలంలోని ఎల్లాయగూడెం, గురిజాల గ్రామాల్లో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాల్లో ఆమె ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ సహజ, వైద్యసిబ్బంది శివాజీ, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని 3వ వార్డులో వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఏఎన్ఎంలు అరుణ, అనిత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలి

పర్వతగిరి : వర్షాకాలంలో వ్యాధులపై గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ మాలోతు శంకర్, ఎంపీఓ పాక శ్రీనివాస్, మండల నోడల్ అధికారి లింగారెడ్డి, ఏపీఓ సుశీల్ కుమార్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : మాట్లాడుతున్న సంజీవరెడ్డి

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

- జిల్లా నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. నర్సంపేటలో పార్టీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి రాణాప్రతాప్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారంటూ హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అనుగుణంగా కేంద్రం బడ్జెట్ రూపొందించిందని చెప్పారు. ప్రభుత్వం పేదరిక నిర్మూలనతోపాటు యువతకు, మహిళలకు, రైతులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. యువత కోసం ఐదు పథకాలతో పీఎం ప్యాకేజీ తీసుకొచ్చారని వివరించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు గడ్డం ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆముదాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

శత్రువులు మిత్రులయ్యాయి..!



వర్ధన్నపేట : పాము.. ముంగీస, కోతి.. కుక్క... ఇలా ఒక దానితో మరొకటికి పడదన్నది జగమెరిగిన సత్యం. కోతులను కుక్కలు తరుముతుండడం పరిపాటి. కాగా కోతి, కుక్క స్నేహం చేయడం వర్ధన్నపేటలో గురువారం చోటు చేసుకుంది. పట్టణంలో కోతిని కుక్క వీపుపై ఎక్కించుకుని విహరిస్తూ వీధుల్లో సందడి చేసింది.

'ఈజీఎస్'లో పారదర్శకతే ధ్యేయం

సంగెం : ఈజీఎస్ పనులు పారదర్శకంగా నిర్వహించడమే ధ్యేయంగా ఏటా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కాసర్ల రవీందర్ తెలిపారు. ఈనెల 26 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించనున్న 15వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక తనిఖీ బృందం గ్రామానికి వచ్చినప్పుడు కూలీలు చేసిన పని, అందిన డబ్బు వివరాలు వెల్లడించాలని చెప్పారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి

నల్లబెల్లి : మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి రాజు ఆధ్వర్యంలో స్థానికులు నర్సంపేట డీఎల్‌పీఓ వేదవతికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడం లేదన్నారు. బస్టాండ్ పరిసరాల్లో కాల్వలు పూడుకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆందోళన వెలిబుచ్చారు. రాత్రి సమయంలో దోమల బెడద ఉంటోందని తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి

నెక్కొండ : జీపీ కార్మికులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్య నరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ సునీల్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేశ్ మాట్లాడారు. కార్మికులు 10 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ట్రాలీ బోల్తా పడి కూలీలకు గాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు ట్రాలీ బోల్తా పడి పలువురు కూలీలకు గాయాలైన ఘటన మండలంలోని చాపలబండ రోడ్డులో గిర్నిబావి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పీజీతండాకు చెందిన 15 మంది కూలీలు గిర్నిబావిలో వరి నాటు వేయడానికి టాటా ట్రాలీలో వెళ్తుండగా గిర్నిబావి సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నూనావత్ తారమ్మ, పద్మ, లావుడ్యా రాజమ్మలకు స్వల్ప గాయాలు కాగా వారు నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..

గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లి సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిలో గురువారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది కథనం ప్రకారం.. సంగెం మండలంలోని నార్లవాయికి చెందిన మెట్టుపల్లి ఐలయ్య తన ద్విచక్ర వాహనంపై వరంగల్ వైపు వెళ్తుండగా వరంగల్ నగరంలోని చింతల్‌కు చెందిన రాదారపు కుమారస్వామి, దుగ్గొండి మండలం మైసంపల్లికి చెందిన చెలకాని రవి ఆటోలో నర్సంపేట వైపు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కుమారస్వామి ఎడమ కాలు నుజ్జునుజ్జు కావడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. రవి ఛాతికి బలమైన గాయలయ్యాయి. ఐలయ్య కుడి చేయి విరిగింది. క్షతగాత్రులను 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన రమేశ్ ఇటీవల మృతి చెందగా దాతల నుంచి సమీకరించిన రూ.66,500 నగదును అతడి స్నేహితులు, గ్రామస్తులు బాధిత కుటుంబానికి గురువారం అందించారు.

పరామర్శ

పర్వతగిరి : బీఆర్ఎస్ పార్టీ పర్వతగిరి గ్రామ కమిటీ అధ్యక్షుడు మెరుగు వెంకన్నను అతడి తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వర్ధన్నపేట : మండలంలోని నీలగిరిస్వామి తండా శివారులో పేకాడుతున్న ఐదుగిరిని పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం అందడంతో దాడి చేసినట్లు తెలిపారు. అరెస్టైన వారి నుంచి రూ.6,190 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి సాయం

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన తీగారపు చంద్రయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి చంద్రయ్య అతని కుమారుడు సాంబయ్య పదో తరగతి స్నేహితులు 30,500 సాయం అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నివాళి

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లికి చెందిన సెర్ప్ సీసీ విసాగరపు రవి (49) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఏపీడీ రేణుకతో కలిసి డీఆర్‌డీఓ కౌసల్యదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పరామర్శించిన వారిలో మదర్ తెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి, ఏపీఎం సునీత, సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు గుండేటి కుమారస్వామి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
ఎం. మురారి (S.R) : 9502950309 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944